

శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ ఎడిటర్స్ : VAS ప్రసాద్, గోర్తి సాయి సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంథ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.

గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

సంపుటి : 09

సంచిక : 01

ఆషాఢ పౌర్ణమి

10 జులై, 2025

## నేపథ్యం:

**పూజ్యశ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం**

సద్గురువును ఆశ్రయించడమంటే ఎలా? దానికి మార్గాలు ఏమిటో శ్రీ సుబ్బరామయ్య సార్ వివరిస్తున్నారు.

http://saimastersevatrust.org/Speeches/sir_Warning.mp3



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

"దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా
మామేవయే ప్రపద్యంతే మాయా మేతాం తరంతితే"

## విషయ సూచిక


| | |
|---|---|
| సంపాదకీయం | **3** |
| భక్తుల అనుభవాలు | **8** |
| శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు | **14** |
| శ్రీ సుబ్బరామయ్య సార్ స్పీచ్ | **20** |






శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి



సద్గురు శ్రీ  సుబ్బరామయ్య మహారాజ్

# సంపాదకీయం

ఓం సాయిరాం

శ్రీ సుబ్బరామయ్య సార్ ఆరాధనా మహోత్సవం జూన్ 9 వ తారిఖున శ్రీ సార్ సమాధిమందిర ప్రాంగణంలో అంగరంగ వైభవముగా జరిగింది. శ్రీ సార్ అభిషేకము, పూజ, సత్సంగము, సార్ చే నిర్మింప బడిన కట్టడాల సందర్శనము, పల్లకి ఊరేగింపు, ఆరతిలతో ఎంతో హృద్యంగా జరుపబడింది.  ఆ మహోత్సవంలో భాగంగా వివిధ భక్తులు పంచుకొన్న

అనుభవాలను, శ్రీ సార్ నుండి చూచి నేర్చుకొనుటకు స్మరించు కొన్న ఉత్తమ గుణాలను ఈ క్రింద పొందుపరచు కొంటున్నాము.

**ఓం శ్రీ సాయిరాం**

**రఘురామ రాజు గారు, రిటైర్డ్ టీచర్, కావలి, శ్రీ భరద్వాజ మష్టారి స్టూడెంట్ ఇలా చెబుతున్నారు:**

ఈ నెల 9 వతేదీ మాన్య శ్రీ సుబ్బరామయ్య సార్ ఆరాధన సందర్భంగా వారి గొప్పతనాన్ని వివరిస్తూ 8 గుణాలు తీసుకున్నాను.

1. త్యాగము: విద్యానగర్ లో మాష్టర్ గారి వద్ద నివసించాలని కొంత స్థలాన్ని కొనుక్కుని కొన్ని అనివార్య కారణాల వల్ల మాష్టర్ గారు ఒంగోలు లో సెటిల్ అయితే సార్ ఆ స్థలాన్ని అమ్మి ఆ సొమ్ముతో సాయిమాష్టర్ నిలయం-1 మొదలుపెట్టారు. మనమైతే ఆ సొమ్ముతో ఇంట్లో వాళ్ళకు నగలో, ఇంటిలో ఫర్నిచర్ కొనడానికి గాని ఉపయోగించేవారము.
2. నిరాడంబరత: సార్ వేషం చూస్తే మహనీయుడని ఎవరూ అనుకొనరు. పాతచొక్కా, పాతఫాంటు లేదా తెల్లబనియను, పంచ.

మాష్టర్ గారికి గడ్డమైనా వుంది. సార్ కు అది కూడ లేదు. మాష్టర్ ఇ.కె. గారు చెప్పినట్టు మహనీయత గుణగణాలను బట్టి వస్తుందే కాని వేషభాషల బట్టిరాదు.

3. నిరంతరశ్రమ: ఎల్లప్పుడు ఆయన ఏదో ఒక పని చేస్తూ, తన దగ్గరకు వచ్చిన వాళ్ళ చేత కూడ చేయించేవారు. మాష్టర్ గారు అన్నట్టు “సోమరితనం ఆధ్యాత్మికత లో మొట్టమొదటి శత్రువు”. అదీగాక "శ్రమతో సేవ, సేవతో కైవల్యం" అనేది సార్ సూక్తి కూడా.
4. ఋజువర్తనము: ఆధ్యాత్మిక మార్గంలో కపటము పనికిరాదు. సార్ ఏ విషయంలో నైనా స్టైట్ ఫార్వర్డ్ గా వుండేవారు. ఎవరి దగ్గర మొహమాటపడటం గాని, భయపడటం గాని ఎరుగడు. తనను చంపుతామని బెదిరించిన తరువాత కూడ వారి లెక్కపెట్టకుండా తన పని తాను చేసుకుపోయే ధీరోదాత్తుడు సార్.
5. ధర్మనిష్ఠ: ఒక్కమాటలో చెప్పాలంటే 'సారో!విగ్రహవాన్ ధర్మ:' అన వచ్చు. ఏ విషయంలో ధర్మం తప్పలేదు. అవధూతలీల ఇప్పటికి 40 రూపాయలు మాత్రమే. సార్ శరీరంతో వున్నపుడే 5 రూపాయలు

నష్టం వచ్చేది. తమ ఫాలోయర్స్ 5 రూపాయలు పెంచుదామంటే అఖ్ఖరలేదు, నా పెన్షన్నుంచి పెట్టుకుంటానన్న ధర్మశీలి. ఇప్పుడు 15 రూపాయలు నష్టం వస్తుంది. ఒకసారి ఇప్పటి చైర్మన్ శ్రీ వేణుగోపాల్ గారితో "సార్! నేను, నా స్నేహితులు కలసి తలా1000 రూపాయలు వేసుకుంటే 15000 వస్తుంది కదా! 1000 పుస్తకాలకు సర్ధుబాటు అవుతుంది" అన్నాను. దానికి వారు ఒప్పుకోక 'ఏమక్కరలేదు, సర్దుబాటు అవుతూ వున్నది' అన్నారు. తన శిష్యులను కూడ ఎలా తీర్చిదిద్దారో చూడండి! ఎవరో ఒక మహాత్ముడన్నారట " సుబ్బరామయ్య శిష్యులు వజ్రాల్లాంటి వారు, ఆయన చెప్పిన మాట తు.చ. తప్పక పాటిస్తారు. ఏ మహాత్ముడి దగ్గరైనా కొద్దిమంది అయినా వ్యతిరేకించే వారుంటారు. ఆయన మాట ప్రేమతో అందరూ ఆచరిస్తారు. ఎంతటి పుణ్యాత్ముడో?" అని. నిజమే గదా మరి!

6. సేవాభావం: ఆయన సేవా గుణం అందరూ చూచినదే. అర్ధరాత్రపుడు వచ్చిన భక్తుల కోసం తానే తలుపు తీసేవాడు, తన

శిష్యులకు తానే వంట చేసి పెట్టాడు, వారు డబ్బు ఇచ్చినప్పటికీ తానే దగ్గరుండి తన స్వంత ఇంటిలాగ కట్టించియిచ్చాడు, శరీరం దుర్గంధంతో కూడిన వారికి వేడి నీటితో కడిగి స్వాంతన చేర్చాడు, లెట్రిన్ గుంట తానే ఎత్తి పోస్తూ శివరత్నానికి ఆదర్శం చూపాడు. ఇలా చెప్పుకుంటే ఎన్నైనా చెప్పవచ్చు.

7. దయాగుణం: మా అమ్మగారు ఆమె వ్యక్తిగత సమస్య చెప్పుకుంటే తన దగ్గరకు వచ్చి వుండమని, తానే రూము ఏర్పాటు చూస్తానని, వండుకోలేనపుడు తగిన ఏర్పాట్లు కూడ చేస్తానని అన్న దయామూర్తి. స్వంత బిడ్డలమే ఉదాసీనంగా వుంటే ఆయనకు ఎందుకు ? అంటాము కదా!

8. సర్వ సమత్వం: తన పిల్లలైనా, పరాయి వారైనా ఆయనకు ఒక్కటే. ఒక్కొకసారి తనవారి కంటే పరాయివారినే ఎక్కువ ప్రేమతో చూశారు. బ్రహ్మం గారి గుడిలో సత్సంగం జరుగుతున్నది, అల్లుడు కూతురు నెల్లూరు బయలుదేరుతున్నారని ఫోను వచ్చింది. అయినా సత్సంగం అయ్యేంత వరకూ కదలలేదు.

ముందు తరాల వారు ఇలాంటి ఒకవ్యక్తి రక్తమాంసాలతో భూమిమీద నడయాడారంటే నమ్మరు. ఈ వ్యాసం వ్రాసి తనను స్మరించుకునే భాగ్యం కలిగించిన సార్ కు ప్రేమతో నమస్కరిస్తూ శెలవు.

## భక్తుల అనుభవాలు

**అనంత లక్ష్మి గారు, సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా చేస్తూనే స్వామి ఆదేశానుసారము గొలగమూడి లో నివాసము ఏర్పరచుకొని ఉంటున్న భక్తులు ఇలా పంచుకొంటున్నారు :**


శ్రీ సార్ తో 1994 నుంచి పరిచయం. 2000 సం || లో ఆరతి అయ్యాక కొద్దిసేపు సత్సంగం చెప్పేవారు. శ్రీ సార్ వెంకయ్య స్వామి గూర్చి కంటే శ్రీ భరద్వాజ మాష్టారి గూర్చి ఎక్కువ చెప్పే వారు. "ఏమిటి ఆయన స్వామి కంటే సాయిబాబా, మాష్టారు గూర్చి చెపుతున్నారు" అనుకునే దాన్ని. అప్పటికి మాష్టారి చరిత్రలు చదవలేదు. ఈ మాష్టారు ఎవరు అనిపించేది. కాని ఒకటి బాగా గుర్తించాను. శ్రీ సార్ కు మాష్టారి గూర్చి చెబుతుంటే ముఖంలో ఆ ఆనందం, లోపల నుంచి ఎంత చెప్పినా తనివి తీరనట్లు చెబుతుండటం నాకు కనిపించేది.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాష్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

ఒకసారి ఆరతి అయ్యాక ఒకళ్ళ కష్టాల గూర్చి ఏమో చేయమని చెబుతూ “స్వామి చీటీలు కూడా వ్రాసి ఇచ్చేవారు”, అని చెప్పారు. నాకు స్వామి హస్త స్పర్శ తగిలినవి కదా. ఎంత భాగ్యమో అవి చూడటం. అలా ఆలోచన వచ్చి సార్ తో ఎవరైనా దాచుకున్నారా ? అని మాత్రం అడిగాను. సార్ “ఉన్నాయమ్మ! కొందరు దాచుకున్నారు” అని తరువాత ఇంట్లోకి వెళ్లి పోయారు. ఒక అరగంట తరువాత  శేషయ్య గారితో ఒక చీటి పంపించారు. నాకు ఎందుకు ఇచ్చారు ? అని, ఏమిటి అది అని చూస్తే ఒక కలర్ fade అయిపోయిన పేపరు, చదవచ్చా, చదవకూడదా అనుకుంటూనే, సార్ పంపించేరు కదా అని చదివితే ఇంకు పెన్నుతో వ్రాసి ఉన్నారు. లేటర్ లా ఉంది. డేట్ వేసి, కోట్లు మణుగులు ఇలా వ్రాసి ఉన్నట్లు ఉంది, ఏమి వ్రాసారనేది సరిగా గుర్తులేదు. చివర వ్రాసి ఉన్నది మాత్రం బాగా గుర్తు ఉంది **“నీకు ఈ జన్మలోనే ముక్తి వస్తుంది అని వ్రాసి ఉంది”.** అది నా మనసులో ముద్రించుకు పోయింది. స్వామి శ్రీ సార్ కు వ్రాసి ఇచ్చిన చీటి అది. స్వామి హస్త స్పర్శ ఉంది అని కళ్ళకు అద్దుకున్నాను. ఇంక సార్

సమాధి అయినంతవరకు అది చెప్పచ్చో లేదో అని చెప్పలేదు. అది శివరత్నం ఒక్కరు చదివారట, తరువాత శ్రీ సార్ సమాధిలో పెట్టి వేసారు.

ఒకసారి ఆరాధనకు వచ్చినప్పుడు నాకు బాగా దాహం వేస్తోంది. రెండు గంటల నుంచి మంచి నీళ్ళు త్రాగకుండా ఉన్నాను. సత్సంగం చెబుతున్న సార్ “ఎవరికైనా దాహం వేస్తోందా ?” అని అడిగారు. ఎవరు మాట్లాడలేదు. నా గురించే అనుకొని, నాకు వేస్తోంది అని చెప్పాను. ఇక్కడ కడిగి కుండలో మంచి నీళ్ళు పెట్టండి, దాని మీద మూత పెట్టండి, గ్లాస్ పెట్టండి అని అక్కడున్న ఇతర పిల్లలకు చెప్పారు. సత్సంగం అయిపోగానే వెంటనే కుండలో మంచి నీళ్ళు పెట్టారు. సార్ చెప్పారు, అంతే చేసారు, అని వెంటనే త్రాగాను.

ఆరాధనకు బెంగుళూరు నుంచి వచ్చాను. బెంగుళూరు వెళ్ళిన నుండి “నాకు దాహం వేస్తోంది అని సార్ కు ఎలా తెలుసు ?” ఇదే ప్రశ్న! అది వారం నుంచి ఆలోచిస్తున్నాను. “స్వామి ఇక్కడే కూర్చొని ఉన్నారు. మనకు కనపడరు. అది సార్ కు కనపడతారు. ఆ స్వామి సార్ కు చెప్పారు.” అని

అప్పటి నా భావన. సర్వవ్యాపకత్వం, సర్వజ్ఞత్వం మొ || అప్పటికి అవధూతలీల చదువుతూ ఉన్నాను, కాని తెలియదు.

బెంగుళురు వెళ్ళిన ఒక వారానికి ఒక కల వచ్చింది. సార్ పడిపోయినట్లు, ఆయన దగ్గర ఉండే పిల్లలు సార్ ను ఎత్తుకొని తీసుకువస్తున్నారు, బ్రహంగారి మఠం, స్వామి మందిరం మీదుగా. స్వప్న దృశ్యం తరువాత సార్ కు ఎలా ఉంది ? సార్ పడిపోయారు ? అని ఆలోచన. ఒక సంవత్సరం తరువాత గొలగమూడి వెళ్ళాను. బ్రహ్మం గారి గుడికి వెళితే అక్కడ ఎవ్వరూ లేరు. అప్పుడు అక్కడుండే ఆవిడ (సరోజనమ్మ గారు) చెప్పింది. సార్ రావటం లేదు, పడిపోయారు, అని. సార్ సమాధి అయ్యాక రెండవ పుస్తకం లో సార్ పడిపోవటం గూర్చి చదివితే నాకు కలలో ఎలా కనపడ్డారో అల్లాగే జరిగింది.

ఒకసారి హైదరాబాద్ వెళ్ళుతూ సార్ తో చెబితే “శ్రీ నాంపల్లి బాబా గారి” ని దర్శించుకోమన్నారు. కాని నాంపల్లిబాబా గారు దిగంబరంగా ఉంటారని వెళ్ళలేదు. కొన్ని సంవత్సరాల తరువాత ప్రతివారం వెళ్ళేదాన్ని. ఒక రోజు అనిపించింది. సార్ ఇదివరకు చెప్పినప్పుడు వెళ్ళలేదు. అప్పుడు

వెళ్ళలేదు, ఇప్పుడు మీరు చెప్పినందున వెళుతున్నాను. అదే ఆలోచన. చిత్రంగా ఆ రోజు రాత్రి శ్రీ సార్ కనపడ్డారు. అలా వారి మాట పాటించేలా చేసి, ఆ స్మరణ/ఎరుక కలిగాక స్వప్న దర్శనము ఇచ్చి ఆశీస్సులు ప్రసాదించారు.

నేను ఇంటి నుండి ఆఫీస్ కు వెళ్ళాక దండం పెట్టుకొని మొదలు పెట్టే దాన్ని. ఇంటికి వెళ్ళాక మరల దండం పెట్టుకొనే దాన్ని. దారిలో నామస్మరణ కూడా చేయాలని మొదలుపెట్టి కొద్ది సమయంలోనే ఏమారి పోయేదాన్ని. ఎప్పుడు మానేస్తానో తెలియదు. చాలసేపు అయ్యాక "మానేసాను" అని తెలుస్తుంది. ఒక రోజు ఆఫీస్ నుండి ఇంటికి వెళుతూ నామస్మరణ ఈ రోజు మీరు చేయించండి. నేను చేయలేక పోతున్నాను, అనుకున్నాను. మొదలిపెట్టి మధ్యలో బస్సు స్టాప్ వద్ద వేచి ఉన్నా. మా చెల్లి వాళ్ళు వచ్చినా, వాళ్ళు మాట్లాడకున్నా శ్రద్ధగా ఇంటికి వెళ్ళేవరకు నామస్మరణ జరిగింది. "మీరు చేయించండి" అని దండం పెట్టుకు బయలుదేరినందుకు / చెప్పుకున్నందుకు శ్రీ సార్ చేయించారు.

**ఒక భక్తురాలు ఇలా చెబుతోంది.** తనకు భగవంతుని గూర్చి సరైన అవగాహన లేక, దైవము గరువు పై ఆధారపడాలి అని అనుకునే ప్రయత్నంలో తన ఆరోగ్యం పూర్తిగా ఇబ్బంది రాగా శ్రీ సుబ్బరామయ్య సార్ సన్నిధికి చేర్చుకొని తనకు ఆరోగ్యము - ప్రశాంతత కల్గించిన అనుభవాన్ని ఇలా పంచుకుంటుంది. "మొదట నుండి ప్రత్యేకత కోరుకొనే మనస్తత్వం." చదువులో మంచి మార్కులతో ఉండేది. క్రమంగా దైవం గూర్చి తన పరిమిత అవగాహనతో చదువుపై శ్రద్ధ - ఆరోగ్యము కోల్పోయి ఉన్నప్పుడు శ్రీ వెంకయ్య స్వామి, సార్ సన్నిధికి (వాళ్ళ అమ్మగారికి వచ్చిన సందేశం అనుసరించి) పిలువబడింది. సాయి మాస్టర్ నిలయంకు వచ్చాక అక్కడ ఉండే చెన్నయ్య గారి సూచనపై శ్రీ సార్ సమాధి వద్ద శ్రీ సార్ కు చెప్పుకోవటం, ఒక గంట శ్రీ సార్ సన్నిధిలో మొరపెట్టుకోవటం జరిగింది. ఏమి జరిగిందో తెలియదు కాని అంతటితో ఆమెకు పూర్తి స్వస్థత చేకూరింది. మాములుగా శ్వాస ఆడటం కష్టంగా ఉందేది. ఎక్కడ పడిపోతానో తెలియదు, అందుకు ఒంటరిగా ఎక్కడికి పంపేవారు కాదు. పైగా నాకు అనారోగ్యం వల్ల విపరీత బలహీనత అని కూడా నా తోడ్తూ మా

అన్నో ఎవరో ఒకరు ఉండేవారు. ఈ గంట సార్ తో మొరపెట్టుకోన్నాక "నేను వెళ్లి టిఫిన్ తింటాను" అంటే చిత్రంగా తోడూ లేకుండా మా నాన్నగారు, అన్నయ్య పంపారు. ఆ రోజు రాత్రి చక్కటి నిద్ర పట్టింది. అంతటి అనారోగ్యము, మానసిక ఆందోళన నుండి పూర్తి స్వస్థత చేకూరింది. ఇంతటి చిత్రమైన అనుభవము ప్రసాదించిన శ్రీ సార్ కరుణామయులు, సర్వసమర్ధులు. శ్రీ సార్ సన్నిధి చాల Powerful అని నా అనుభంతో చెప్పగలను.

## శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు

***నియమ పాలన - బలహీనతల చింత -- మన ధ్యేయము - గురువాజ్ఞ పాలన***

గొలగమూడి

17-05-05

Dear Sai!

ఏ నియమాలు లేకుండా ఉన్నట్లు పశుపక్ష్యాదులు కనబడుతాయి. కానీ వాటి మితం మించి ఒక్క మెతుకు కానీ, ఒక్క గడ్డి పోచ కానీ తినవు. మనం ఇంత ఉన్నతమైన జ్ఞానం పొంది కూడా ఆహార నియమం లేకుండా

జీవిస్తే ఎలాగు? నీవు తప్పక ఆహార నియమం పాటించాలి. డాక్టర్ని అడిగి కొన్ని మందులు తగ్గించుకో. మితం మీరి తింటే మనసు కాన్సన్ట్రేట్ కాదు. “ఇంద్రియాణం హి చరతాం ------ -----.తదస్య హరతి ప్రజ్ఞాం --- “ అవుతుంది. మనకెంతో రోషం ఉంది. కోపం ఉంది. వీటిని మన చాపల్యాల మీద ఉపయోగించాలి. నియమపాలన లో కోపం చూపించు. అంతేకానీ లెటర్స్ వ్రాస్తే గురువేమి చేయగలడు?

అంతటి ప్రాణాపాయ స్థితి నుంచి “ఉప్పు లేకుండా ఒక పూట తిను. భార్యను తాకకు.” అనే ఆదేశాల ద్వారా ప్రాణ దీక్ష పెట్టారు. ఆ నియమాలు పాటించక తన బాధలు తానే కొని తెచ్చుకున్నాడు శివరామయ్య.

మార్గమధ్యంలో అమ్మను ఇబ్బంది పెట్టకుండా మద్రాసు వెళ్ళవా ? లేక ఆమెను ఏడిపించావా ? మనలో ఉండే బలహీనతల గురించి అతిగా చింతించకూడదు. ఇది మాస్టారి మాట- ఎన్ని బలహీనతలు ఉన్నా మన ధ్యేయము, కృషి మన గురువుగారి ఆదేశాన్ని పాటించటం లోనే కేంద్రీకృతము అవ్వాలి. అదే గురుచరిత్ర లో ధౌమ్యుడు మొదలైన ముగ్గురు శిష్యుల నుండి మనం నెర్చుకోవలసినది. నా కళ్ళు కనబడవే, నడవలేని

బలహీనతే అని రోసిరెడ్డి అక్కడే కూర్చోలేదు. పొద్దస్థమూ ప్రార్థన చేయలేదు. ఎన్ని ఇబ్బందులైన పడి నాలుగు గంటలసేపు నడిచి గొలగమూడికి వచ్చాడు (నెల్లురు నుండి). నీవు నీ గమ్యం వైపు కృషి పెంచు. పూజ time మార్చుకో. ఆహార విషయంలో నీకు నీవే "ఇంత కంటే ఎక్కువ తినకూడదు" అని నియమం పెట్టుకో. గురువాజ్ఞ పాటించకుంటే ఉచ్చూరు శివరామయ్య ఎన్ని బాధలలో ఉన్నాడో చూడు! IIT లో Admit చేసుకోవడమే స్వామి దయ. ఇది బాగా గుర్తించు.

మీ

పె. సుబ్బరామయ్య

**------------------శ్రీ సద్గురు దేవా శరణం శరణం ----------------**

***గురువు ఎడల కృతజ్ఞతా భావంతో మన మనసు నింపుకోవాలి***

గొలగమూడి

Dear Sai!

మన గురువు ఎడల కృతజ్ఞతా భావంతో మన మనసు నింపుకోవాలి. నీ కెన్ని విధాల సహాయం చేసారో యోచించు. బెంగుళూరు లో పడపోయినప్పుడు నీకు తెలియకుండానే గొలగమూడి వచ్చావు. ఆ దివ్య పురుషుని సన్నిధి లో ఏ మందు లేకుండా బాగయింది. అన్నం ఇమడక కక్కవాడివి. ఆది క్రమంగా తగ్గింది. ప్రస్తుతం లేదు. మరల IIT లో Admit అయ్యావు. Quarter ఇప్పించారు. Madras I.I.T లో సీటు ఇచ్చారు. ఇప్పించారు. రూర్ఖీ లో వస్తే నీవు స్వామి దగ్గరకు రాలేవని అలా చేసారు. నియమపాలనను మనం సాధించాలి. గాని శ్రీ స్వామి వారి కి దూరమైన శిష్యులవలె తయారుకాకూడదు.

అడ్డమైన తిండే వారిని స్వామికి దూరం చేసింది. మితాహారం పాటిస్తే నే నీకన్ని సరిపడతాయి. ఒక నెల పాటించి చూడు.

పె. సు

**------------------శ్రీ సద్గురు దేవా శరణం శరణం ----------------**

పూజ్యులైన గురు బంధువులు శ్రీమతి లక్ష్మక్క గారికి (<u>inland కవర్ కంటిన్యూయేషన్)</u>

(మనకు) ప్రపంచంతో సంబంధం తెంచేశారు. మహాయోగి శ్రీ అరవింద గారిని జైల్లో పెట్టి కృష్ణ సాక్షాత్కారం ఇచ్చినట్లు చేస్తున్నాడు. మనసులో కించిత్తు కూడా బాధ ఉంచుకోకుండా, వారిని స్మరించాలి. బాధపడ్డా, పడకపోయినా జరిగేది అంతే! అలాంటప్పుడు మనం బాధపడి, ఆ మహనీయుని బాధ పెట్టడం ఎందుకు? ఆ ప్రేమ మూర్తి మనలను నాలుగు చేతులతో పట్టుకొని యున్నాడు అన్న గట్టి నమ్మకం ఉండాలి. ఇప్పటి కష్టాల ద్వారా వారు మనకు ఓర్పు అనేది నేర్పుతున్నారని నమ్మాలి. నాకు బాధలు ఉన్నాయి, కానీ అదేమి చిత్రమో అవి బాధలుగా నేను అనుకోను. “ఆయన మన కర్మను కడిగి సిద్ధం చేస్తున్నారు” అనే నమ్మకంతో కాలం గడుపు తుంటాను. నన్ను అనేకులు దూషిస్తుంటారు. మన సహాయం పొందిన వారే! కానీ అవి మన మంచికే అనుకుంటాను. వాళ్ళ దూషణ నాకేమీ గుచ్చుకోవు కదా! “దైవ లీలలు తెలియని అమాయకులు” అని సరి పెట్టుకుంటాను. ఫైనల్ గా అంతా ఆయన తప్పక చక్క బరుస్తారు.

శ్రీ స్వామివారి ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య

**-------------------శ్రీ సద్గురు దేవా శరణం శరణం -----------------**

గొలగమూడి

21-05-05

Dear Sai!

నువ్వు 16వ తేదీ, 18వ తేదీన వ్రాసిన లెటర్లు చేరాయి. పిండి తినడం లాంటి Extremes వద్దు. మితాహారం పెట్టుకో. తినేటప్పుడు విధిగా నామం చెబుతూ తిను. అమ్మను చెప్పమను (పెద్దగా). నీవు మరిచిపోయినా ఆమె చెప్పేటప్పుడు గుర్తు వస్తుంది. బుద్ధి కుదురుగా లగ్నం కావాలంటే మితాహారం తప్పకుండా ఉండాలి. ఇష్టం వచ్చినట్లు తినకూడదు. మన నాలుక, చాపల్యమే, మనలను శ్రీ స్వామివారి ఆజ్ఞను పాటించకుండా చేస్తుంది. **నిద్ర లేవగానే నా "మితాహార నియమం మీరే పాటింప చేయాలి తండ్రి" అని ప్రార్థించు. హృదయంతో ప్రార్థించు. శ్రీ స్వామి వారు తప్పక చేయూతనిస్తాడు. ఇది నా అనుభవం.** అసలు భయపడకూడదు. అయ్యో!

నేను ఇలా అయిపోయానే! అని అనుకోకూడదు. కావాలంటే పూర్వం కంటే గొప్పగా కఠోర నియమ పాలన చేయగలనని ధీమాతో ఉండు. శ్రీ స్వామి సత్యసంధుడు. నీకు తప్పక సహాయం చేయమని ప్రార్థిస్తున్నాను.

పెసల సుబ్బరామయ్య

********** సద్గురు దేవా శరణం శరణం ***********

# శ్రీ సుబ్బరామయ్య సార్ స్పీచ్

## సద్గురువును ఆశ్రయించడం అంటే?

**<u>జన్మరాహిత్యము</u>: గురువు మాయను ప్రక్కకు తొలగించడానికి మనము ఏమి చెయ్యాలి?**

ఆయన ఏమంటాడంటే భగవద్గీతలో,

**"దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।**

**మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే"**

దైవ సంబంధమైన మాయ దాటశక్యము కానిది. <u>నన్నే శరణు పొందితే నువ్వు మాయను దాటగలవు</u> అంటాడు. నా యొక్క ఆర్గ్యుమెంట్

ఏందంటే- ఇప్పుడు మాయ నన్ను పట్టుకుని ఉంది కదా, మాయ నన్ను పట్టుకుని ఉంటే నిన్ను శరణు పొందనిస్తుందా? ఆయన ఏమంటారు? మాయను నువ్వు దాటాలంటే నన్నే శరణు పొందు. అప్పుడు నువ్వు దాటతావు అంటాడు. కానీ మాయ నిన్ను ముంచుతోంది కదా? ఇంక నిన్ను ఎట్లా పట్టుకోనిస్తుంది కాళ్లు? అట్లా వెంకయ్య స్వామి దగ్గరికి వెళ్లి దండం పెట్టుకొని వద్దామంటే, వద్దులే పదబ్బా అంటుంటుంది. అర్థమైందా? కనుక దీనికి సొల్యూషన్ ఎట్లా? వాడెవడికోనంటా ఒకడికి పిచ్చి కుదిరితే పెళ్లి అవుతుంది అన్నాడట. పెళ్లయితే పిచ్చి కుదురుతుంది అన్నాడట ఇంకొకడు. ఇదా అదా ముందు? ఏది ముందయ్యా? పిచ్చివాడికి ఎవడిస్తాడు పిల్లను? పిచ్చి కుదిరితే పెళ్లి అవుతుంది అంటారు ఇంకొకరు. పెళ్లి నువ్వు కుదుర్చుకుని రా అయ్యా పిల్లనిస్తాము. ఈ సమస్య తేలకపోయేసరికి నేను భరద్వాజ మాస్టర్నీ, అందరినీ అడిగడిగి ఎంతమందిని అడిగినా గాని ఏమీ నో రిప్లై. ఒక్క రవ్వ రావడం లేదు రిప్లై. సరేనని ఎవ్వరూ లేకపోతే ఆయనే కదా దిక్కు అని, ఏం సార్ ఒక రవ్వ చెప్పకూడదు సార్? అని అడిగితే, అది మొదలుకొని పొద్దుల్లస్తమాను

జ్ఞానేశ్వరి చదువు, జ్ఞానేశ్వరి చదువు అన్నట్లుంది నాకు లోపల. ఆయనేమీ నాకు కలలో కనిపించి చెప్పలా, ఇంకో విధంగా చెప్పలా. అంతకు ముందు లేనటువంటి వ్యవహారము, రెండు మూడు నెలల నుంచి తంతాలు పడుతుండా. అక్కడ నమస్కారం చేసిన తక్షణం నుంచి జ్ఞానేశ్వర్ చదువు జ్ఞానేశ్వర్ చదువు అని స్ఫురణ ఒకటి మేలుకొంది నాలో. సరే నని చెప్పి జ్ఞానేశ్వరి తీసి చూసాను. నా దగ్గర జ్ఞానేశ్వరి భగవద్గీతకి కామెంట్రీ ఉంది. తీస్తే ఆయన ఏందంటే

“సద్గురువునాశ్రయించిన వాడికి ఈ గొడవ ఏమీ ఉండదు”. అంటే ఈ మాయ గొడవ వాడికి పట్టదంట! అట్లా చెప్తూ ఆయన, **సద్గురువును ఎట్లా ఆశ్రయించాలో కూడా చెప్పారు.** దుంపతెగ! నేను టెంకాయ కొట్టాను, ఆయన్ను ఆశ్రయించాను కదా! నేను వెంకయ్య స్వామి సన్నిధిలో పడి ఆయన కూడు తింటున్నాను కదా! అయ్యి కుదరదంట. ఆయనను యెట్లా ఆశ్రయించాలో అట్లా ఆశ్రయిస్తే, **మాయని ఆయన ప్రక్కకు నెడతారు. ఆగాగు అంటాడు. మావాడు వీడు, క్యూలో పోతున్నాడు, నువ్వేం చేయబాక! అంటాడు.** లేదు నేను టెంకాయలు కొట్టాను, నేను ఆయన

దగ్గరే ఉన్నాను, నేను ఆయన కూడే తింటున్నాను. **ఆయన చెప్పినవి ఆచరించాలి, సద్గురువు చెప్పినవి ఆచరిస్తే అప్పుడు ఆయన కృప కలుగుతుంది మన మీద.**

ఒక భక్తురాలితో మాట్లాడుతూ "పుస్తకం మర్చిపోయాను తల్లి, నా పుస్తకం అయితే బాగుండును" అన్నారు.

ఆ భక్తురాలు : తెమ్మంటారండి?

సార్ : వద్దొద్దు... దివ్యానుభవములు...వక్కెమ్మా....భరద్వాజ మాస్టర్ వ్రాసినాడు... భరద్వాజ మాస్టారు అంటే స్వామి చెప్పిందానికి ఈయన కామెంట్రీ వ్రాస్తున్నాడు.

ఒక భక్తుడు కొంతకాలం స్వామిని సన్నిహితంగా సేవించి, తర్వాత అతి చనువు వలన వారి పట్ల శ్రద్ధ తగ్గి (వెంకయ్య స్వామి ఎడల శ్రద్ధ తగ్గి, అతిచనువు అయిపోయింది, ఆ ఎప్పుడు ఈ ముదనష్టపు వాడు గోచి పెట్టుకుని ఉంటాడు) అవకాశం వచ్చినప్పుడల్లా పామరులతో కలిసి తిరగడం ఆరంభించాడు (అవి రుచిగా ఉంటాయి- పామరులతో; పామర్లంటే ఈ ఆధ్యాత్మిక చింతనే ఉండదు వాళ్ళకి. వాడేదో కబుర్లు

చెబుతూ ఉంటాడు. తాగుబోతు కబుర్లు, తాటి ముంజలు కబుర్లు, అమ్మాయిల కబుర్లు) అంతకుముందు అతడు నివేదిస్తేనే గాని భోజనం చేయని శ్రీ స్వామి వారు, తర్వాత ఇతడు పెడితే స్వీకరించక, ఆయన మనుషుల్లోనికి పోయ్యాడయ్యా, ఆయన వద్దు, నువ్వు పోయి గంజి అనేవాడు. ఆయన మనుషుల్లోకి పోయి వచ్చాడు కాబట్టి ఈయనకి అంటు. **ఆ మనిషికి అంటు ఏంది?** ఎవరైనా చస్తే కాదు, పీనుగుని తాగితే కాదు! **లౌకికమైన మనుషులతో కలిసి వస్తే అంటు వాడికి.** అందుకని తాకద్దు అంటున్నాడు, నాకొద్దు నువ్వు పోసే నీళ్ళు, అని మరొక సేవకుడిని కోరనారంభించాడు. మొదట్లో తెలియక సన్నిహిత సేవకుడైన గురవయ్య (అది ఒక సన్నివేశం అయిపోయిందా ఆడికి. నీకంటురా పోరా... ఎందుకు వచ్చింది వాడికి అంటు? వేరే వాళ్ళతో కలిసి మాట్లాడినందువల్ల) ఎప్పుడైనా వారి సన్నిధిని విడిచి దూరంగా వెళితే, నువ్వు కూడా మనుషుల్లోకి పోతుండావయ్యా? (నీకు కూడా అంటుకుంటోందా, ఒక్కొక్క రవ్వ!) అని మందలించేవారు. అంటే ఇప్పుడు మాస్టర్ గారి యొక్క కామెంట్రీ: **మనుషుల సాంగత్యము ముముక్షువునకు తగదు.** ఒక్కటే

వాక్యం...అబ్బా! గీత గీసినాడయ్యా ఎర్ర విష్ణుమూర్తి. నల్ల విష్ణుమూర్తి గాదు, ఆయిన ఎర్ర విష్ణుమూర్తి. మనుషుల సాంగత్యము ముముక్షువుకు తగదు. ఏది మనిషేగదా ముముక్షువుకు మాత్రం మనిషి కాదా? ముముక్షువు కూడా మనిషే. వాడు లౌకికమైన మనిషి. అది. వాడూ మనిషే, వీడూ మనిషే కదా? సాధకునకు మనుషుల సాంగత్యం పనికిరాదంటే, ఇద్దరు కూడా మనుషులే! వాడికీ రెండు కాళ్ళే, వీడికీ రెండు కాళ్ళే. వాడికి రెండు ముక్కులే, వీడికి రెండు ముక్కులే! అందరూ సమానంగానే ఉండారు, వాడిని కోస్తే నెత్తురు, నన్ను కొస్తే పాలు ఏం రావు. అదే చెప్పేది వాడిని తీసుకునిపోయి ఎందుకు చంకలో కూర్చోబెట్టుకుంటాడు? అందరూ ఒకటే కదా, సమానమే కదా వెంకయ్య స్వామికి? వాడి చంకే నాకుతాడు ఎందుకు వెంకయ్యస్వామి? అంటారు కొంతమంది. ఏమ్మా పదిమంది సేవకులు ఉంటే, పదిమంది తాగకూడదట. ఈయన్ని, వెంకయ్యస్వామిని ఇద్దరే తాకుతూ ఉండాలట ఎప్పుడు పట్టినా అదేందది. ఈనేం మహనీయుడా? ఈనేం సేవకుడు? నిజమేనా? అందర్నీ సమానంగానే చూడాలంట కంటితో, అందరిచేత తాగించుకోవాలంట, అది ఆయన సిద్ధాంతం.

ఈయన సిద్ధాంతం ఈయన ఇట్లా ఎందుకు చెప్తుంటారు అనేది వెంకయ్యస్వామికే తెలుసు. మనకేం తెలుసు? మనకు అదివరకే పైది పైది మాత్రమే చూస్తాము. పో అంటే పోతుండ్లై జబ్బులు, అట్లా పోగొట్టే స్థితిలో మనం ఉంటే మనకి తెలుస్తుంది ఆ రహస్యం ఏమిటో. ఆ రహస్యం ఏందంటే విష్ణుమూర్తి గారు చెప్తున్నారు. లౌకికుల యొక్క సాంగత్యము సాధకునకు తగదు! లౌకికుల యొక్క సాంగత్యము సాధకునకు తగదు!! ఈన్ని బుట్టలోకి తోస్తాడన్నమాట, ఆ లౌకికమైన వ్యవహారాల్లోకి పోయి. మనుషులే కాదు; పేపరు కూడా. పేపర్ చదవకూడదంట! భరద్వాజ చదివేవాడే? ఈయనది ఒక సిద్ధాంతం. భరద్వాజ ఏం చదివేవాడో నీకు తెలుసా? అది చెప్పలేడు! వాళ్ళింటికి పేపర్ తెప్పిస్తున్నారు, అది మాత్రం తెలుసు వాడికి. బుక్ రివ్యూ మాత్రమే చూస్తారాయన, పేపర్ విసిరి అవతల పారేస్తారు అంతే! పుస్తకాలమ్మా! ఏ ఏ పుస్తకాలు వచ్చాయి, గ్రంథ సమీక్ష అంటారు. ఈరోజు పేపర్ లో కొన్ని పుస్తకాల సంగతి వేస్తాడు, రేపు పేపర్లో కొన్ని పుస్తకాల గురించి వేస్తారు. రోజు వేస్తూనే ఉంటారు. ఆయన ఇట్లా తీయడము, గ్రంథ సమీక్ష చదివేస్తారు, ఇసిరి అవతల పారేస్తారు. ఇది

చదువుకోడానికి ఇంకొకరి ఇంటికి పోయి తెచ్చుకుంటారా పేపరు? అది అయ్యే పనేనా? మనం పోయే సమయానికి వాళ్ళు చదువుకుంటూ ఉంటారు, ఈయన అదే పనిగా ఆ ప్రక్కకి ప్రక్కకి తిరుగుతూ ఉంటారా? ఛాఛా! డబ్బు పడేసి తెప్పించుకుంటే మనం కావలసి వచ్చినప్పుడు చదువుకుంటాం. ఆ ఇంకా అప్పుడు తీరుబడలేదు, ఇంకెప్పుడో తీరికబడి ఉంటుంది, అప్పుడు చదువుకుంటారు కదా బుక్ రివ్యూ. ఆయన చదివింది బుక్ రివ్యూ, మనం చూసేది ఏంటి ఆయన పేపర్ తెప్పించుకునీ ఆయన చదవాలా?

చేతో గచ్ఛతి పీనతాం అని చెప్పి 11 శ్లోకాలో, 12 శ్లోకాలో ఉన్నాయి. చేతస్సు అంటే మనసు, గచ్ఛతి అంటే అవద్ది, పీనతామంటే పెద్దది; పెద్దదవుతుందిట మనస్సు! ఎప్పుడు? వశిష్టుడు రాముడికి బోధిస్తాడు. చేతో గచ్ఛతి పీనతాం, చేతో గచ్ఛతి పీనతాం అని లాస్ట్ లైన్ లో అదే వస్తుందన్నమాట ఈ 11 శ్లోకాలలో. నాకు ఆ శ్లోకాలు రావు నోటికి. ఇవన్నీ చెప్పినాడు! ఆస్తిపాస్తులను సంపాదించాలని వీడు ఆలోచనలో పెడితే, చేతస్సు పెద్దదవుతుంటది. లోకంలో నేను కీర్తి ప్రతిష్టలు


తెచ్చుకోవాలంటే వాడికి చేతస్సు పెద్దదవుద్ది! మావోళ్ళు మావోళ్ళు పెద్దోళ్ళు కావాలంటే వాడికి చేతస్సు పెద్దదవుద్ది. నా కూతురు, నా కొడుకు, నా భార్య, నేను, నా..నా..నా..నా..నాతో..వీడు పెద్దోడైపోతాడు! సాధన అంటే ఏమిటి? అంటే, అవి కుదించుకు రావాలంట. నువ్వు ఉండావు నాయనా, నీకు ఒకటే ధ్యాస, చదువు చదువు చదువు అంతే. నేను చెప్పినానే కాకదృష్టి, బకధ్యానం, మితాహారమని, ఈ వ్యవహారంలోనే ఉండాలి నీ చేతస్సు పెరగకూడదు.  ఆ! విషయాలు తెలియద్దు? కొంతసేపు పేపరు కూడా చదువుదాం. చదువు, నిన్ను వద్దన్నారా? నీ చేతస్సు పెంచుకో! నీకు ఏకాగ్రత పోతుంది!! పెద్దది అవుతూ ఉంటుందన్నమాట. రొంతసేపు రాజకీయాలు. ఆమె ఎవరో చచ్చిపోయిందంటయ్యా, సినిమా యాక్టర్, సౌందర్య. నాక్యాడా తెలియదు. ఆ, అంటూన్నారమ్మా, నాక్యాడా వచ్చి చెప్పారు. సరే లేవయ్యా, సౌందర్య చనిపోతే, మనం చావమా ఏంది? సౌందర్య చేస్తే ఈ ఊరికి వచ్చిందయ్యా వార్త, అబ్బా, ఊరూరికి. ఈ ఊరికి ఒక్కదానికేనా? మనం చస్తే ఏ నా కొడుకు అనుకోడు. ఎవరనుకుంటారూ? మనవాళ్లు లబోదిబో అని ఏడ్చి, తెల్లారి వాళ్లు కూడా గమ్మయిపోతారు.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

**మనుషుల సాంగత్యము ముముక్షువునకు తగదు అని వారి హెచ్చరిక.** స్వామి చెప్పినాడన్నమాట గీటు గీసి, రెఫ్యూజ్ చేశాడు కదా జావ పొయ్యిబోతే! మనుషుల్లోకి పోతున్నావు నువ్వు జాగ్రత్తని ఈయనకి చెప్పాడు, వాడికి అసలు నువ్వు పనికిరావు పొమ్మన్నాడు. కాబట్టి అది ఇండైరెక్టుగా ఇదంతా చెప్పడంలే, మనుషులు సాంగత్యం ముముక్షువునకు పనికిరాదు అని భరద్వాజ మాస్టర్ రాసిన కామెంట్లు అంతా చెప్పలే! అదే **చూసి నేర్చుకోండయ్యా** అనేది వెంకయ్యస్వామి. ఏద్దైనా చెప్తే కదా స్వామి మంచి, చెడ్డ అంటే, చెప్పేదేముందయ్యా? చూసి నేర్చుకోవడమే కదా? అన్నారు. ఒకటే మాట, అయిపోయింది, ఇక లక్ష మార్లు బోధించిన లాభంలే. **ఆయన ఏం చెప్తున్నాడు? నీ ధ్యేయం ఏంది? <u>నాలాగే తయారవ్వాలనీకదా! నాదగ్గరకు వచ్చి చస్తుండారు సాధన</u>? మీ వ్యవహారం ఏందంటే, అరిషడ్వర్గములను హరించవలెను, చాపల్యములు హరించవలెను, అష్టమదములు తొలగవలెను అని కదా మీరు నా దగ్గరికి ఏడ్చారు? *నేను చెప్పింది ఆచరించొద్దా అయితే?*** చూసి నేర్చుకోండి నన్ను!



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

## సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ సమాధి మందిర నిర్మాణ సేవ

ప్రియమైన గురు బంధువులకు నమస్కారములు!

దమ్మపేట వాస్తవ్యులు దారా నాగేశ్వరరావు గారు శ్రీ సార్ సూచనా అనుసరించి దాదాపు పది సంవత్సరముల నుండి ప్రతి నెల దమ్మపేట నుండి గొలగమూడి వచ్చి శ్రీ స్వామి వారిని దర్శించు కోవటం చేస్తూ ఉన్నారు. వారికీ శ్రీ స్వామి వారితో ఎన్నో అద్భుతమైన అనుభవాలను శ్రీ సార్ ప్రచురించిన చిన్న పుస్తకాలలో చూడవచ్చు. వారికీ శ్రీ సార్ స్వప్న దర్శనము లో "ఇక్కడ చలిగా ఉంది" అని చెప్పారు. ఇప్పటి వరకు నలువైపులా కటకటలతో ఉన్న సమాధి చుట్టూ ఉన్న నిర్మాణాన్ని మందిరముగా చేయమని శ్రీ సార్ ఆదేశముగా భావించి శ్రీమాన్ ఎక్కిరాల అనంత కృష్ణ మాస్టర్ గారి ఆశీస్సులు కోరటం జరిగింది.

శ్రీ సద్గురు సుబ్బరామయ్య సార్ స్వప్న సందేశము, సద్గురు ట్రినిటి (శ్రీ సాయి, వెంకయ్య స్వామి, భరద్వాజ మాస్టర్) ప్రేరణ అనుసరించి శ్రీ సార్ సమాధి మందిర నిర్మాణం చేయుటకు శ్రీమాన్ ఎక్కిరాల అనంత కృష్ణ

మాస్టర్ గారి ఆశీస్సులతో 8 జూన్ 2025 ఆదివారమున శంఖుస్థాపన చేయడమైనది.

గురుపూర్ణిమ జూలై 10, గురువారం నుండి పనులు ప్రారంభించడం జరిగింది. భక్తులు ఎవరైనా కాయిక శ్రమతో సార్ కి సేవ చేద్దామనుకుంటే సార్ సమాధి వద్ద మందిర నిర్మాణ సేవలో పాల్గొనుటకు అవకాశము కలదు.

ఆ సమాధి మందిర నిర్మాణము విశ్వగురుడైన శ్రీ సార్ సేవగా జరిగి ఆ సేవా యజ్ఞములో మనందరమూ సమిధలుగా పాలు పంచుకొని గురుకృపకు పాత్రులమగునట్లు మనలను ప్రేరేపించి నడపించమని అందరి హృదయస్థుడు అయిన ఆ సద్గురునే ప్రార్థిస్తున్నాము. మన శారీరక, వాచిక, మానసిక సేవలను ఆ గురుడు తలపెట్టిన విశ్వకళ్యాణములో భాగము అగుటకు ప్రయత్నముగా “చూచి నేర్చుకో" అనే గ్రంథ పారాయణ జూన్ 11, 2025 ప్రతిరోజూ రాత్రి 9 గం 45 ని|| (IST ) 15 నిమిషాల పాటు WhatsApp లో జరుగుతున్నది. వీలు గలవారు పాల్గొనగలరు.



**సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ పాదుకలు**